# పెళ్ళాన్నాత్రేలప్పేవు

## — వసుంధర

చాలాకాలంవరకూ పద్మనాభానికి సీతామాలక్ష్మి మొగుడనే పేరుండేది. అందుకు పద్మనాభం బాధపడనూలేదు. అతడికెప్పుడూ సరైన వ్యక్తిత్వం లేదు. ఒకరి నీడన నమ్మకంగా పడిఉండడం అతడికలవాటు. తండ్రి నీడలో అతడు బాగా చదువుకున్నాడు. భార్య నీడలో అతడు వ్యాపారి అయ్యాడు.

వివాహమైన తొలిరాత్రి సీతామాలక్ష్మి అతడితో "ఇంతకాలం నేను మానాన్న అదృష్టదేవతని. ఈరోజునుంచి మీ అదృష్ట దేవతను. నా కారణంగా మన సంసారం వైభవంగా కొనసాగిపోవాలంటే ముందు మనిద్దరికీ సరైన అవగాహన ఉండాలి. అందుకు మనమధ్య ఒక్క రహస్యంకూడా ఉండకూడదు. ఈరోజు నుంచి ప్రారంభించి వారం రోజుల్లోగా మనమిద్దరం ఒకరి రహస్యాలొకరు పూర్తిగా తెలుసుకోవాలి" అంది.

సీతామాలక్ష్మిలో ఏ హిప్నాటిక్ పవర్ ఉందోకానీ పద్మనాభం ఆమెకు రెండు రోజుల్లోనే తన గురించిన రహస్యాలన్నీ చెప్పేశాడు. అందులో అతి ముఖ్యమైన రహస్యం సావిత్రి గురించి.

సావిత్రి అతడి మరదలు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికిష్టం. పద్మనాభం తల్లికి కూడా సావిత్రిని కోడల్ని చేసుకోవాలనే ఉంది. కానీ పద్మనాభం జీవితంలో పైకి రావాలంటే డబ్బున్న మామగారు కావాలని పద్మనాభం తండ్రి అభిప్రాయం. జీవితంలో పైకి రావాలని పద్మనాభానికీ ఉంది.

ఇది విన్నాక సీతామాలక్ష్మి కోపగించుకోలేదు. పైగా మనస్ఫూర్తిగా నిజాలు చెప్పినందుకతణ్ణి అభినందించింది. "మీరు తప్పక గొప్పవారవుతారు. అయితే నేను మీకు భార్య అని మీరనుకోకూడదు. మీరు నాకు భర్త అనే ఎల్లప్పుడూ అనుకోవాలి" అందామె.

ఈ మాటలకర్థం అతడికి తెలియలేదు. కానీ త్వరలోనే అతడికి సీతామాలక్ష్మి మొగుడన్న పేరు వచ్చింది.

ఆరంభంలో పద్మనాభం కాస్త బాధపడ్డాడు. అప్పుడు సీతామాలక్ష్మి అతడితో "రాముడు మన ఆరాధ్యదైవం.

ఆయనకూ మీకూ ఒకటి మాత్రమే తేడా ఆయన ఏకపత్నీవ్రతుడు. మీరు పత్నీ వ్రతుడు. ఇద్దరికీ 'ఏక' అంటే ఒకటి మాత్రమే తేడా !" అంది.

ఆతర్వాతనుంచి అతడు తను పత్నీ వ్రతుడినని అందరికీ చెప్పుకునేవాడు.

పద్మనాభం భార్యావిధేయత చూసి ముచ్చటపడి కేంద్రంలో అధికారపక్షంలో ఉన్న రాజకీయ నాయకుడు అతడికి పార్టీ సభ్యత్వం ఇప్పించాడు. ఏ ముహూర్తాన పద్మనాభం పార్టీలో చేరాడోకానీ అటు పార్టీ ప్రతిష్ఠ, ఇటు పద్మనాభం వైభవం ఒక్కసారిగా పెరిగాయి.

నాలుగు సంవత్సరాల్లో పద్మనాభం కోటీశ్వరుడయ్యాడు. అతడి అభిమాన రాజకీయనాయకుడు కేంద్రంలో మంత్రి అయ్యాడు. అతడు పద్మనాభంతో "వ్యాపారంలో ఒక దశకు చేరుకున్నాక సంపాదించిన డబ్బును రక్షించుకునేందుకు రాజకీయాలవసరం. కొన్ని కుటుంబాలు వ్యాపారమే జీవనాధారంగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నాయి. మనవంటివారు వారికిలా కలకాలం వ్యాపారాన్ని నమ్ముకోలేరు" అని హితబోధ చేశాడు.

పద్మనాభం భార్యను సంప్రదించి అనుమతి తీసుకున్నాక అభిమాన రాజకీయ నాయకుడికి తన అంగీకారాన్ని తెలియబర్చాడు. అప్పుడు పద్మనాభం ప్రధాన మంత్రికి పరిచయం చేయబడ్డాడు.

ప్రధానమంత్రి పద్మనాభాన్ని వ్యక్తిగతంగా పరీక్షించి సమీక్షించి అతడు బొత్తిగా వ్యక్తిత్వం లేనివాడని రూఢీ అయినాక "త్వరలోనే ఎన్నికలు వస్తున్నాయి, అప్పుడు నీకు పార్టీ టికెట్



ఇస్తాను. కొత్త మంత్రివర్గంలో యువ తరానికి ప్రాతినిధ్యం ఉంటుంది. నీకు మంత్రి అయ్యే అవకాశ ముంది" అని చెప్పాడు.

ఆరోజునుంచి పద్మనాభం దేశమంతా పర్యటించడం ప్రారంభించాడు. ప్రతి చోటా అతడు ప్రధానమంత్రి గొప్ప తనాన్ని పొగుడుతూండేవాడు. అతి తక్కువ కాలంలో ప్రధానమంత్రి సాధించిన అత్యద్భుతాలను ప్రజలకు తెలియజెప్ప సాగాడు. ఆ కారణంగా వార్తాపత్రికల్లోనూ, దూరదర్శన్‌లోనూ అతడికి ప్రాముఖ్యత లభించింది. ఎన్నికలకు ముందే పద్మనాభం ప్రజలకో ఆశాకిరణంలా, నవజ్యోతిగా ప్రచారమయ్యాడు.

ఆంధ్రరాష్ట్రంలో అధికార పక్షానికి నెగ్గే అవకాశాలు తక్కువ. అందువల్ల మంత్రి కాగల అవకాశమున్న నాయకులను ఇతర రాష్ట్రాలనుంచి పోటీ చేయమనే కొత్త సంప్రదాయం వచ్చింది. ఆవిధంగా పద్మనాభం ఉత్తరప్రదేశ్‌నుంచి పోటీ చేసి నెగ్గాడు. మంత్రికూడా అయ్యాడు.

ఇప్పుడు పద్మనాభానికి సీతామాలక్ష్మి మొగుడన్న పేరులేదు. అతడిపేరు దేశమంతా మ్రోగిపోతోంది. అందుకు సీతామాలక్ష్మి కంగారుపడి "వ్యక్తిత్వం లేని వారని తెలిసీ మిమ్మల్ని పెళ్ళాడాను. వ్యక్తిత్వం లేకుండా కలకాలం కొనసాగుతారని నమ్మి సంతోషంగా ఉన్నాను. ఇప్పుడు మీకు వ్యక్తిత్వం వచ్చేసింది. నాగతి ఏంకావాలి ?" అనడిగింది భర్తను.

"వెర్రిదానా! ఇప్పటికీనాకు వ్యక్తిత్వం లేదు. మన దేశంలో వ్యక్తిత్వమున్న వాళ్ళు గొప్పవాళ్ళు కాలేరు. వ్యక్తిత్వాన్ని చంపుకోవడంలో నా తండ్రి కొంత శిక్షణ యిచ్చాడు. ఆ తర్వాత నువ్వు అద్భుతమైన శిక్షణ యిచ్చావు. ఆ కారణంగానే నేను మంత్రినయ్యాను. నీవు దిగులుపడకు ఇప్పటికీ నేను పత్నీవ్రతుడినే!" అన్నాడు పద్మనాభం.

"ఇప్పుడు మీరు పత్నీవ్రతులుకారు" అంది సీతామాలక్ష్మి.


"ఎందుకుకాను ? ప్రధానమంత్రిలో నిన్ను చూసుకుంటున్నాను. అందువల్లనే ఆయనపట్ల వినయంగా ఉండగల్గుతున్నాను..." అన్నాడు పద్మనాభం.

సీతామాలక్ష్మి చాలా సంతోషించి "అయితే ఒక్కవిషయం. మీరు నాకు పూర్వంలాగే ప్రతి రహస్యాన్నీ చెబుతూ ఉండాలి" అంది.

"నీదగ్గర నేను రహస్యం దాచగలనా ?" అన్నాడు పద్మనాభం.

ఆ తర్వాతనుంచి అతడు మాటమీద నిలబడ్డాడు. అయితే పరీక్షా సమయం రెండు సంవత్సరాల తర్వాత వచ్చింది.

సమస్యా సమయానికి ఆర్నెల్లక్రితం పద్మనాభం అవినీతి నిరోధక శాఖకు మంత్రి అయ్యాడు. ప్రధానమంత్రి అతడి వ్యక్తిత్వానికి, సమర్థతకు సంతోషించి—ఆ కొత్త శాఖను సృష్టించి అతడి శాఖకు మార్చాడు. మంత్రి అయిన ఆర్నెల్లకు "అవినీతిని నిరోధించడానికి ప్రభుత్వం కనీవినీ ఎరుగని ఓ కొత్త పథకం ప్రారంభిస్తోందనీ, అది ఎప్పుడు ఎలా ప్రారంభించబోతున్నదీ ఎవరికీ తెలియదనీ" పద్మనాభం ఓ ప్రకటన చేశాడు. ఈ ప్రకటన దేశమంతా సంచలనాన్ని సృష్టించింది దేశంలో ఎక్కడ చూసినా అతడి




పేరే వినబడుతోంది.

ఎందరో పత్రికావిలేఖరులతణ్ణి ఇంటర్వ్యూ చేశారు. పథకం గురించి ఒక్క ముక్కకూడా రాబట్టలేకపోయారు.

పద్మనాభం వ్యాపారమంతా యిప్పుడు బావమరిది చూస్తున్నాడు. కొత్తపథకం గురించి అతడు భయపడి సీతామాలక్ష్మితో "అక్కా! వ్యాపారమంటే ఎంతోకొంత అవినీతి తప్పదు. బావగారి నడిగి ఆపథకమేమిటో ముందుగా తెలుసుకుంటే నేను జాగ్రత్త పడతాను" అన్నాడు.

సీతామాలక్ష్మి పద్మనాభాన్ని పథకం గురించి అడిగింది.

"అది రహస్యం - చెప్పకూడదు" అన్నాడు పద్మనాభం.

"నాదగ్గర మీకు రహస్యాలా?" అంది సీతామాలక్ష్మి.

"ప్రధానమంత్రి శాసనం నాకు నీ శాసనంలాంటిదే! నీక్కూడా ఆ రహస్యం చెప్పరాదని ఆయన శాసనం" అన్నాడు పద్మనాభం.

భర్తనుండి నయానా, భయానా ఆ రహస్యం తెలుసుకోలేనని గ్రహించేక సీతామాలక్ష్మి ఆగ్రహించి "ఈరోజు మీరీ స్థితిలో ఉన్నారంటే నేను కారణం. నాకు మీరీరహస్యం చెప్పకపోతే నేను మీనుంచి విడాకులు తీసుకుంటాను" అంది.

ఆమెతో విడాకులంటే - అదృష్టదేవతతో విడాకులని పద్మనాభానికి తెలుసు. అందుకని అతడు భార్యతో ఓ అంగీకారానికి వచ్చాడు.

భర్త తనకు రహస్యం చెప్పలేదంటే సీతామాలక్ష్మికి చిన్నతనం. కానీరహస్యం తెలిస్తే ఆమె బంధువులామెనుంచి రాబట్ట గలరు. అలా అలా అది అందరికీ పాకిపోతుంది. అప్పుడు పద్మనాభం మంత్రి పదవి ఊడుతుంది. కాబట్టి ఇద్దరిపరువూ నిలబడేమార్గం వేరేవుంది.

ఇతరులకు తాళం తెరవడానికిసాధ్యమైన డిచ్చీ ఒకటి వాళ్ళింట్లో ఉంది. పద్మనాభం తన పథకం వివరాలు ఓ కాగితం మీద రాసి దాన్నోసీల్డు కవర్లోఉంచి ఆ కవరుని డిచ్చీలో వేస్తాడు. డిచ్చీ తాళం పద్మనాభం దాచి ఉంచుతాడు. సీతామా

లక్ష్మి అందరికీ పథకం గురించి తనకు తెలుసనే చెబుతుంది. ఆమెకు తెలుసనడా నికి సాక్ష్యంగా పథకం బైటపడ్డాక ఆ డిబ్బీని తెరవడమే!

సీతామాలక్ష్మి దీనికి అంగీకరించింది. భర్తకు మంత్రిగా మంచి పేరుండాలంటే ఆ రహస్యం కాపాడబడాలి. ఆ రహస్యం కాపాడబడి తన పరువుపోకుండా ఉండా లంటే పద్మనాభం చెప్పిందే మంచిమార్గం

"ఒక్కవిషయం గుర్తుంచుకోండి. డిబ్బీ తెరిచి కవరు విప్పేక అందులో అసలు పథకం లేకపోతే విడాకులు తప్పవు-" అంది సీతామాలక్ష్మి.

"సరే! ఒక్కసారి ప్రధానమంత్రిని కలుసుకుని దీనికి ఒప్పించివస్తాను" అన్నాడు పద్మనాభం.

"ఇది మీకూనాకూమధ్య విషయం. ఆయనకు చెప్పడమెందుకు?" అంది సీతా మాలక్ష్మి చిరాగ్గా.

"ఆయన అనుమతి లేనిదే నేనేమీ చేయలేను..." అన్నాడు పద్మనాభం.

సీతామాలక్ష్మి ఎంత రభస చేసినా పద్మనాభం దీనికి అంగీకరించలేదు. చివరి కామె ఒప్పుకుంది.

పద్మనాభం ప్రధానమంత్రి దగ్గరకు బయల్దేరబోతూండగా అతడికాయననుంచే ఫోన్ వచ్చింది. పద్మనాభం అప్పుడు తనున్న పరిస్థితి వివరించి చెప్పాడు. బదులుగా ప్రధానమంత్రి నవ్వి "ఇలాంటి రహస్యాలు భార్యవద్ద దాచనవసరంలేదు నీ భార్యను నమ్ము -" అన్నాడు.

ఈ మాటలు సీతామాలక్ష్మికి విన బడ్డాయి. అప్పుడామెకు కలిగిన సంతోష మింతా అంతాకాదు. తనే ఓ సారి ఫోనం దుకుని ఆయనకు థాంక్స్ చెప్పి తన భర్త తననుమానించి అవమానించిన బాధంతా ప్రధాన మంత్రి తనకిచ్చిన గౌరవంతో పోయిందంది.

హిందూ సంస్కృతి భార్యను గౌర వించడంలోనే ఉందని ఆమెకు ప్రియ వాక్యాలు చెప్పి ఫోన్ పద్మనాభాని కిమ్మన్నాడాయన, పద్మనాభం ఫోనందు కోగానే -"రేపుదయం ఎనిమిది గంటలకు అత్యవసర మంత్రివర్గ సమావేశముంది. ఇది నేను స్వయంగా కొందరు ముఖ్యాను చరులకు మాత్రమే చెబుతున్నాను. ఇక ఉంటాను...." అని ఫోన్ పెట్టేయబో తూండగా -

"సార్-ఒక్క మాట!" అన్నాడు పద్మనాభం.

"ఏమిటది?"

"నిజంగా నాభార్యకు ఆ రహస్యం చెప్పవచ్చా?"

"చెపవచ్చునన్నాగా..."

"ఇప్పుడే చెప్పవచ్చా?"

"ఊఁ"

"సర్- అయితే అవినీతిని నిరోధించ డానికి నేను ప్రారంభించనున్న ఆ కొత్త పథకమేమిటో వెంటనే నాకుచెప్పి పుణ్యం కట్టుకోండి. లేకుంటే ఈరోజుకు నాభార్య నాపడం కష్టం-" అన్నాడు పద్మనాభం.

అక్కడే ఉండి ఆమాటలు వింటున్న సీతామాలక్ష్మికి ఆశ్చర్యంతో నోటమాట రాలేదు. భార్యకుకూడా రహస్యం చెప్ప కుండా తనఅనుచరులనునమ్మకంగాఉంచ డానికి ప్రధానమంత్రి అవలంబిస్తున్న కొత్త పద్ధతి మాత్రం ఆమెకు అప్పుడర్థ మయింది. ♦♦♦